GHMC hmda TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID: sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assesments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout's, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Happy 75th Independence Day
క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 04-07-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

## అధికారుల నిర్లక్ష్యం..


# మనుమడి అకౌంట్‌లో తాత పింఛన్

- చనిపోయిన తాత పింఛన్..! మనుమడి ఖాతాలోకి ఏళ్లుగా జమ..!
- అధికారుల నిర్లక్ష్యమా.. లేక వ్యవస్థ వైఫల్యమా..?
- ప్రభుత్వ ఖజానాకు గండి పడితే బాధ్యులు ఎవరు..?
- ఒకే పేరుతో పింఛన్ మారిపోతే.. ధృవీకరణ ఎక్కడ..?
- దశాబ్దకాలంగా పింఛన్ జమ అవుతుంటే అధికారులకు తెలియలేదా..?
- పింఛన్ గోల్‌మాల్‌పై పూర్తి స్థాయి విచారణ జరగాల్సిందే..!
- నిజాలు వెలుగులోకి వస్తే మరెన్ని ఇలాంటి కేసులు బయటపడతాయో..?
- ఈ-కేవైసీ చేసినా బయటపడని పింఛన్ గోల్‌మాల్..!
- అక్రమార్కులు అక్రమాలకు పాల్పడితే క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది..!
- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే క్రైమ్ మిర్రర్ తట్టి లేపుతుంది..!





2లో



Pensioner Details

| | |
|---|---|
| Pension ID | : MDHAR01165 |
| Name | : SHAKEEL AHMED SHAIK |
| Relation Name | : SHAIK AHMED |
| Gender | : Male |
| Age | : 80 |
| Scheme | : O.A.P |
| Aadhaar Number | : ********9328 |
| Mobile No | : 95 |
| Auth Status | : Not Done |
| Auth Response | : NA |
| e-KYC Auth Status | : Not Done |
| e-KYC Auth Response | : NA |
| Capture Remarks Status | : Not Done |
| Remarks | : NA |
| House No. | |
| Street | |
| Habitation | |
| Panchayat/Ward | : |
| Mandal/Municipality | : Hathnoora |
| District | : Sangareddy |

## భూసేకరణకు వేగం...

## పునరావాసానికి ప్రాధాన్యం..!!

నిర్వాసితులకు జాప్యం లేకుండా ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు

అధికారులతో ఆర్అండ్ఆర్ కమిషనర్ సమీక్ష

పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ




3లో

# భార్యను చంపిన భర్త



దుండిగల్, జూలై 3: మద్యం తాగొద్దన్నందుకు కట్టుకున్న భార్యను చంపి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు యత్నించిన ఉదంతం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని పల్నాడు జిల్లా ఎడ్లపాడు మండలం, కొత్తసొలస గ్రామానికి చెందిన కిలారు బాలక్రిష్ణ అదే మండలంలోని సంక్రాంతిపాడు గ్రామానికి చెందిన భార్గవి(35)తో 2014లో పెద్దల సమక్షంలో వివాహ మైంది. వివాహానంతరం దంపతులు నగరానికి వచ్చి, నిజాంపేట్ సర్కిల్ పరిధి, బాచుపల్లి, రాజీవ్ గాంధీనగర్ ఎదురుగా ఉన్న జయదీపిక ఎస్టేట్‌లోని 102 ఫ్లాట్‌లో నివాసముంటున్నారు. వీరికి ఒక కూతరు, కొడుకు ఉన్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేసే బాలక్రిష్ణ గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసయ్యాడు. దీంతో పిల్లలు పెరిగి పెద్దవుతున్నారు, మీరు మద్యం తాగొద్దని భార్గవి తన భర్తను మందలించడంతో కోపం పెంచుకు న్నాడు. జూన్ 20న మద్యం మత్తులో ఇంటికి వచ్చిన బాలక్రిష్ణ తన భార్యను దూషిస్తూ ఈ రోజు మధ్యాహ్నం నీవు ఉరేసుకుని చస్తున్నావంటూ ఇంట్లోంచి వెళ్లిపోయాడు. అనంతరం రాత్రి ఇం టికి చేరుకున్న బాలక్రిష్ణ తన భార్యను గొంతునులిమి హత్యచేసి ఏమీ ఎరగనట్లు డైనింగ్ హాల్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసి భార్గవి ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ముఖ్యమంత్రి ఉర్కొండపేట దేవస్థాన పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గ పరిధిలోని ఉర్కొండపేట శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకోవడంతో పాటు ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ముఖ్యమంత్రి భద్రతా విభాగం ఉన్నతాధికారులు, ఇంటెలిజెన్స్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. హెలిప్యాడ్, ఆలయ ప్రాంగణం, ముఖ్యమంత్రి సభా వేదిక, ప్రజల రాకపోకల మార్గాలు, వాహనాల పార్కింగ్ స్థలాలు, కాన్వాయ్ ప్రయాణ మార్గం, భద్రతా పాయింట్లను స్వయంగా తనిఖీ చేసి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి భద్రతా విభాగం ఆధ్వర్యంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని శాఖల వారీగా సమీక్షించారు. ముఖ్యమంత్రి ప్రయాణ మార్గం నుంచి కార్యక్రమం ముగిసే వరకు అమలు చేయాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రజల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, అత్యవసర సేవలు, వైద్య బృందాల మోహరింపు, అగ్నిమాపక సన్నద్ధత, విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుద్ధ్యం, కమ్యూనికేషన్ వ్యవస్థ, ప్రజా రద్దీ నియంత్రణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించి అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి శాఖకు బాధ్యతలు అప్పగించామని, భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావులేదని, ప్రతి అధికారి తన బాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తించాలని ఆదేశించారు. శాఖల మధ్య




సమన్వయం అత్యంత కీలకమని, చిన్నచిన్న అంశాలను కూడా విస్మరించకుండా పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ..., ముఖ్యమంత్రి భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ బందోబస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాన్వాయ్ ప్రయాణించే మార్గమంతా పటిష్ట భద్రత కల్పించడంతో పాటు ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికను సిద్ధం చేశామని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను సమర్థవంతంగా నియంత్రించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను మోహరించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి భద్రతా విభాగం తరఫున అదనపు ఎస్పీ చి. వాసుదేవ రెడ్డి, డీఎస్పీలు ఎ. శ్రీధర్ రెడ్డి, డి. కృష్ణ ఏఎస్ఎల్‌లో పాల్గొని స్థానిక యంత్రాంగంతో కలిసి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా ప్రణాళికను అమలు చేసే విధానంపై సంబంధిత అధికారులకు పలు సూచనలు అందించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అరుణా రెడ్డి, దేవ సహాయం, కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య, విద్యుత్, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాలు, ఆర్ అండ్ బీ, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు, ఆలయ ఈవోతో పాటు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారుల నిర్లక్ష్యం.. మనుమడి అకౌంట్‌లో తాత పింఛన్

**హత్నూర, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, జూలై 03:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని కసాల గ్రామంలో ప్రభుత్వ సామాజిక భద్రతా పింఛన్ పంపిణీలో సంచలన నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. చనిపోయిన ఓ వృద్ధుడి పేరుతో వస్తున్న పింఛన్‌ను అదే పేరున్న మనుమడు తన బ్యాంకు ఖాతాకు మళ్లించుకుని ఏళ్ల తరబడి వినియోగిస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన ప్రభుత్వ పింఛన్ వ్యవస్థలో అధికారుల పర్యవేక్షణ, ధృవీకరణ ప్రక్రియలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది. కసాల గ్రామానికి చెందిన షకీల్ అహ్మద్ షైక్ (80) అనే వృద్ధుడి పింఛన్ 2014కు ముందే నుంచే మనుమడి ఖాతాల్లోకి జమ అవుతోందని తెలిసింది. ఆయన మరణించినప్పటికీ పింఛన్ నిలిపివేయకుండా కొనసాగినట్లు సమాచారం. ఇదే పేరున్న అతని మనుమడు తన వ్యక్తిగత వివరాలు, జన్మతేదీ తదితర సమాచారాన్ని ఉపయోగించి పింఛన్‌ను తన బ్యాంకు ఖాతాకు మళ్లించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మొదట పోస్టాఫీసు ద్వారా అందిన పింఛన్‌ను తర్వాత దౌల్తాబాద్ ఇండియన్ బ్యాంకు ఖాతాకు మార్చిన సమయంలో కూడా అధికారులు సరైన ధృవీకరణ చేపట్టలేదని తెలుస్తోంది. అప్పటి నుంచి ప్రతి నెలా జమవుతున్న పింఛన్ మొత్తాన్ని ఫోన్‌పే వంటి డిజిటల్ చెల్లింపు విధానాల ద్వారా నగదుగా మార్చుకుని వినియోగిస్తున్నట్లు సమాచారం. ఇటీవల నిర్వహించిన ఈ-కేవైసీ ప్రక్రియలో కూడా అసలు లబ్ధిదారుడి జీవన స్థితి, గుర్తింపును నిర్ధారించకుండా ధృవీకరణ పూర్తి చేయడం అధికారుల పనితీరుపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. బయోమెట్రిక్, ఆధార్ అనుసంధానం వంటి వ్యవస్థలు ఉన్నప్పటికీ ఈ వ్యవహారం బయటపడకపోవడం తీవ్ర నిర్లక్ష్యంగా స్థానికులు అభిప్రాయపడుతున్నారు. 2014 కు ముందు నుంచి ఇప్పటి వరకు సుమారు రూ.3 లక్షలకుపైగా ప్రభుత్వ పింఛన్ మొత్తం మనుమడి ఖాతాలో జమై ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇంతకాలం సంబంధిత శాఖ అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది, బ్యాంకు వ్యవస్థ ఈ అక్రమాన్ని గుర్తించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. పింఛన్ లబ్ధిదారుల వివరాలను క్రమం తప్పకుండా పరిశీలించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని పలువురు పేర్కొంటున్నారు.

**హత్నూర ఎంపీడీఓ శంకర్ వివరణ:**

ఈ విషయంపై హత్నూర ఎంపీడీఓ శంకర్‌ను క్రైమ్ మిర్రర్ ప్రతినిధి సంప్రదించగా, ఈ అంశం తన దృష్టికి వచ్చిందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలు నిర్ధారించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోని ఇతర పింఛన్ లబ్ధిదారుల వివరాలపై కూడా సమగ్ర పరిశీలన చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తు చేస్తోంది.





# రెడ్ క్రాస్ సేవలు జిల్లా మొత్తం విస్తరింప చేసేందుకు కృషి

**-జిల్లా కలెక్టర్,రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు అనురాగ్ జయంతి**

**యాదాద్రి జిల్లా,జూలై 3,క్రైమ్ మిర్రర్ :** రెడ్ క్రాస్ సేవలను జిల్లా మొత్తం విస్తరింప చేసేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రెడ్ క్రాస్ జిల్లా కమిటీతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో ఆపదలో ఉన్నవారికి, తలసేమియా రోగులకు రక్తం అందించేందుకు ప్రభుత్వ శాఖలన్నింటినీ సమన్వయ పరిచి, రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. సీనియర్ సిటిజెన్లకు క్యాన్సర్ పేషంట్ల కోసం ప్రత్యేకంగా అవగాహన, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం ఇండో అమెరికన్ నందమూరి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి తో శిబిరాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయమని ఆదేశించారు. ఉన్నత పాఠశాలల్లో జూనియర్ రెడ్ క్రాస్ కమిటీలు, జూనియర్ ,డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్ క్రాస్ కమిటీలను ఏర్పాటు చేసేందుకు ఆయా శాఖల ఉన్నతాధికారులను తోడ్పడాలని సూచించారు. విద్యార్థి, యువతను స్వచ్ఛంద సేవా కార్యక్రమాల వైపు మళ్లించేందుకు ఇప్పటినుంచే వారికి శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని పరిశ్రమలను రెడ్ క్రాస్కు తోడ్పాటున అందించే విధంగా చూడాలన్నారు. జిల్లా కేంద్రంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఏర్పాటు కోసం కేటాయించిన స్థలం కోసం అన్ని అనుమతులు ఇప్పించేందుకు సహకరిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. రెడ్ క్రాస్ సభ్యత్వాన్ని కూడా పెంచాలని అన్నారు. అనంతరం రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.లక్ష్మీనరసింహారెడ్డి, వైస్ చైర్మన్ దిడ్డి బాలాజీ ,డివిజన్ చైర్మన్ సద్ది వెంకటరెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో చేపడుతున్న రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలు సభ్యత్వ నమోదు, రెడ్ క్రాస్ జూనియర్, యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి , భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీవోలు కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, డీఈవో బిక్షపతి, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి బి.శేఖర్ రెడ్డి, రెడ్ క్రాస్ డైరెక్టర్లు శేక్.హమీద్ పాశ,కే ప్రభాకర్ రెడ్డి, పన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఎస్.ఎన్.చారి, రామ్ రెడ్డి, భువనగిరి పట్టణ చైర్మన్ పురుషోత్తం రెడ్డి , చంద్రశేఖర్, యూత్ వింగ్ జిల్లా చైర్మన్ బీసు మచ్చ గిరి

## డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలి: శశిధర్ రెడ్డి వినతి



**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 03:** బీరంగూడ డివిజన్ పరిధిలోని నారాయణరెడ్డి కాలనీ ఫేజ్–2లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను తక్షణమే పరిష్కరించాలని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి సంబంధిత అధికారులను కోరారు. ఈ మేరకు అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడిన శశిధర్ రెడ్డి, వర్షాకాలంలో డ్రైనేజీ నీరు రోడ్లపైకి పొంగిపొర్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మురుగునీరు నిల్వ ఉండటం వల్ల ప్రజారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యను పరిశీలించిన అధికారులు అవసరమైన చర్యలు త్వరలోనే చేపట్టి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీపై కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ సమస్యను గుర్తించి అధికారులతో మాట్లాడిన శశిధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు హేమంత్, శంకర్, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి.. గుర్తింపు కోసం పోలీసుల విజ్ఞప్తి

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 03:** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలోని గాంధీ చౌక్ బండంకొమ్ము వద్ద శుక్రవారం తెల్లవారుజామున సుమారు 1 గంట సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి సుమారు 50--55 సంవత్సరాలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని ప్రస్తుతం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుడు గులాబీ రంగు ఫుల్ షర్ట్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉండగా, ఎడమ చేతికి తెలుపు రంగు కడియం ఉంది. అలాగే నలుపు, తెలుపు రంగుల గడ్డం కలిగి ఉన్నాడు. ఈ వ్యక్తి గురించి ఎవరైనా గుర్తిస్తే లేదా సమాచారం తెలిసిన వారు వెంటనే అమీన్పూర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సెల్ 8712581445 లేదా అమీన్పూర్ పీఎస్ సెల్ 8712661842 కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.



# ఆర్ఎంపీ కేంద్రాలపై వైద్యశాఖ నిఘా..!!

- జిల్లాలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన డీఎంహెచ్‌వో
- హైవి ఫ్లూయిడ్స్, ఇంజెక్షన్లు ఇవ్వొద్దని స్పష్టమైన ఆదేశాలు
- నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు అందజేస్తున్న చికిత్స విధానాలు, నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీల అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ, ఆర్ఎంపీలు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా మాత్రమే ప్రథమ చికిత్స అందించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా రోగులకు హైవి ఫ్లూయిడ్స్, ఇంజెక్షన్లు, వివిధ రకాల యాంటీబయాటిక్స్, ఇతర అత్యవసర వైద్య చికిత్సలు అందించరాదని సూచించారు. రోగి పరిస్థితి తీవ్రంగా ఉన్నట్లయితే ఎలాంటి ఆలస్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి లేదా ఉన్నత వైద్య కేంద్రానికి వెంటనే తరలించాలని ఆదేశించారు. ఆర్ఎంపీలు తమ పరిధిని దాటి వైద్య సేవలు అందించడం వల్ల రోగుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ వైద్య సేవలు అందించినట్లు గుర్తిస్తే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని ఆర్ఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఆకస్మిక తనిఖీలు చేపట్టి నిబంధనలు అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని జిల్లా వైద్యాధికారులకు డీఎంహెచ్‌వో ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్, డీడీఎం మధు తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణకు వేగం...పునరావాసానికి ప్రాధాన్యం..!!

- నిర్వాసితులకు జాప్యం లేకుండా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలు
- అధికారులతో ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ సమీక్ష
- పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల అమలుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు నిర్వాసితులకు అందించాల్సిన పునరావాస, పునర్నిర్మాణ (ఆర్‌అండ్‌ఆర్) ప్యాకేజీలను సకాలంలో, పూర్తి పారదర్శకతతో అందించాలని ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూపాలపల్లిలోని ఐడీఓసీ కార్యాలయంలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు, జెన్‌కో, సింగరేణి సంస్థలకు సంబంధించి కొనసాగుతున్న భూసేకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి రెవెన్యూ, సర్వే, సింగరేణి, జెన్‌కో శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసేకరణకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్ (పీఎన్), పీడీ, అవార్డు తదితర ప్రక్రియల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న సాగునీటి, విద్యుత్, పారిశ్రామిక ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను ఆలస్యం లేకుండా పూర్తి చేయాలని సూచించారు. భూములు కోల్పోయే నిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన పునరావాస, పునర్నిర్మాణ ప్యాకేజీలను నిబంధనల మేరకు పారదర్శకంగా అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, భూ యజమానుల అభ్యంతరాలు, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రతి నిర్వాసితుడికి న్యాయం జరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వానికి ఈ అంశం అత్యంత ప్రాధాన్యమైనదని పేర్కొన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, జిల్లాలో అమలవుతున్న చిన్న కాళేశ్వరం, జెన్‌కో, సింగరేణి తదితర ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫిర్యాదులకు తావులేకుండా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, భూసేకరణ పూర్తయిన వెంటనే సంబంధిత భూములను ఇరిగేషన్ శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి, కాటారం ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కుసుమకుమారి, జెన్‌కో చీఫ్ ఇంజనీర్ శ్రీప్రకాశ్, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, అన్ని మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ, సర్వే, జెన్‌కో, సింగరేణి శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ట్రినిటీ స్కూల్ ఎదుట అఖిలపక్ష విద్యార్థి,యువజన సంఘాల భారీ ధర్నా



**చౌటుప్పల్,జులై 3,క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ పట్టణంలో ఒకే ప్రభుత్వ అనుమతితో మూడు పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని ట్రినిటీ స్కూల్ యాజమాన్యానికి వ్యతిరేకంగా శుక్రవారం అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు . విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రభుత్వ విద్యా నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అక్రమంగా నడుస్తున్న విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... వీరమళ్ళ కార్తీక్ గౌడ్ ,పల్లె మధుకృష్ణ, దిండు భాస్కర్, కొండూరు వెంకన్న, పబ్బు వంశీ,బండిగారి శ్రీధర్,తిగుళ్ల శ్రీను, రాఘవులు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ విద్యాసంస్థలపై పర్యవేక్షణ పూర్తిగా కోల్పోయిందని విమర్శించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఒకే అనుమతితో అనేక పాఠశాలలను నిర్వహించడం చట్టవిరుద్ధమని, అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకుండా ఉండటం అత్యంత బాధాకరమన్నారు. విద్యార్థుల భద్రత, విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ నిబంధనలు అన్నింటినీ పక్కనబెట్టి కొందరు పాఠశాల యాజమాన్యాలు వ్యాపార ధోరణితో విద్యను నడుపుతున్నాయని ఆరోపించారు. గత కొంతకాలంగా చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేని పాఠశాలలు, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాలు వరుసగా పోరాటాలు చేస్తున్నాయని గుర్తు చేశారు. అధికారులు స్పందించకపోవడంతో ప్రజాస్వామ్య పద్ధతిలో ధర్నా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ఉద్యమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని నాయకులు తెలిపారు. ప్రజాస్వామ్య హక్కుగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాన్ని అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం ఉద్యమకారులపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు వెంటనే ట్రినిటీ స్కూల్తో పాటు చౌటుప్పల్ మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, గుర్తింపు పత్రాలు, మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లు, ప్రభుత్వ నిబంధనల అమలుపై సమగ్ర విచారణ చేపట్టి అక్రమాలు నిర్ధారణ అయితే సంబంధిత యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని, అక్రమాలకు పాల్పడుతున్న యాజమాన్యాలను కాపాడడం కాదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చట్టబద్ధమైన చర్యలు తీసుకోకపోతే అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయికి ఉద్యమాన్ని విస్తరించి మరింత ఉధృతంగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కొప్పు రామకృష్ణ,కొల్లూరు నవీన్, రాకేష్, గంగాదేవి శివ, వాలీ, అశోక్, సన్నీ,హరీష్, మనోజ్, ప్రణయ్,మరియు అఖిలపక్ష విద్యార్థి,యువజన సంఘాల నాయకులు,కార్యకర్తలు, విద్యార్థులు,ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

### చౌటుప్పల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్,జులై 3, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 14 వ వార్డు గణేష్ నగర్ లో అండర్గౌన్ డ్రైనేజీ పనులకు శుక్రవారం మున్సిపల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ 14వ వార్డ్ కౌన్సిలర్ ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్,12 వ వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి ,17 వ వార్డు కౌన్సిలర్ చింతల ఉమా మహేశ్వరి సాయిలు,16 వ వార్డు కౌన్సిలర్ బత్తుల జయమ్మ దాస్, కో ఆప్షన్ సందగల్ల విజయ సతీష్ ,పస్తం గంగరాములు తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మున్సిపాలిటీలోని అన్ని వార్డులను అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వర్కాల రవి, కామిశెట్టి చంద్ర శేఖర్ ఉడుగు వెంకటేష్, చెరుకు రాజు ,శివకుమార్ చారి,బాబా, గుత్తా ధనలక్ష్మి, తండా లక్ష్మమ్మ,పందుల విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిమ్స్‌లో జర్నలిస్టులకు ప్రత్యేక హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి

### తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్

**ఆత్మకూరు(ఎం),జూలై 03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో జర్నలిస్టుల కోసం ప్రత్యేక హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు మహమ్మద్ షానూర్ డిమాండ్ చేశారు.ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు అనేక ఒత్తిడులు, ప్రతికూల పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నారని,ఎండనక, వాననక, పగలు--రాత్రి తేడా లేకుండా ప్రజా సేవలో నిమగ్నమయ్యే జర్నలిస్టుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు అవసరమని, జర్నలిస్టులకు ఆరోగ్య సమస్యలు తలెత్తిన సమయంలో సరైన వైద్య సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వైద్య సేవలు, క్రమానుగత ఆరోగ్య పరీక్షలు, వైద్య సదుపాయాలు తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, మండల అధ్యక్షులు సిద్దులు పాల్గొన్నారు.



# కల్హేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనం ప్రారంభం

### ప్రజలు పోలీస్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి: ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 03:** సంగారెడ్డి జిల్లా కల్హేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ మాట్లాడుతూ.. జిల్లాల పునర్వ్యభజన తర్వాత తాత్కాలిక భవనంలో కొనసాగిన కల్హేర్ పోలీస్ స్టేషన్ ఇప్పుడు అన్ని సౌకర్యాలతో కూడిన నూతన భవనంలో సేవలు ప్రారంభించడం సంతోషకరమని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని, ఫిర్యాదుల పరిష్కారానికి జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, గంజాయి సాగు, మాదకద్రవ్యాల విక్రయాలు లేదా అక్రమ రవాణాపై సమాచారం ఉంటే జిల్లా ఎస్-న్యాబ్ హెల్ప్‌లైన్ 8712656777కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. నూతన పోలీస్ స్టేషన్ భవనం పోలీసుల విధి నిర్వహణను మరింత సమర్థవంతం చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టి సీఐ వెంకట్ రెడ్డి, కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్, సిర్గాపూర్ ఎస్ఐ జి. మహేష్, కంగ్టి ఎస్ఐ దుర్గారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లెలగూడ లో ప్రపంచ మెకానిక్స్ డే

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** మహేశ్వరం నియోజకవర్గంలోని జీహెచ్ఎంసీ పరిధిలోని జిల్లెలగూడ లో ప్రపంచ మెకానిక్స్ రోజు సందర్భంగా ఆటో మొబైల్స్ అండ్ మెకానిక్స్ టూ వీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంతోష్ నగర్, చంపాపేట వారి ఆధ్వర్యంలో చందన చెరువు వద్ద ఏర్పాటు చేసిన రక్త దాన శిబిరంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సందర్భంగా 67 సార్లు రక్త దానం చేసిన కిరణ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి లింగోజీ గూడ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు పోరెడ్డి భాస్కర్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, గట్టు బాలకృష్ణ, అక్కి శ్రీశైలం, బొల్లపల్లి కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్, కమిటీ సభ్యులు నరేందర్, విష్ణు, ముకుంద రెడ్డి, హరిబాబు గౌడ్, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.





## సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయిని బాబు మృతదేహానికి నివాళులు అర్పించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఆత్మకూరు(ఎం),జూలై03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయిని బాబు అనారోగ్యతో మరణించడంతో శు క్రవారం రోజు ఆయన పార్థివదేహంపై పూలమాలవేసి నివాళు లర్పించిన ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య.వీరివెంటా మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు కందడి అనంత రెడ్డి, ప్రధాన కార్యదర్శి జన్నాయికోడే నగేష్, పట్టణ అధ్యక్షుడు పోతగాని మల్లేశం, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి,తదితర నాయకులు పాల్గొన్నారు.

## పెద్ది మల్లేశం మృతదేహానికి నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్



**ఆత్మకూరు(ఎం),జూలై03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామం మధిర ఇప్పల్లలో శుక్రవారం రోజు బిక్షమయ్య గౌడ్ బంధువు పెద్ది మల్లేశం మరణించడంతో వారి పార్థివ దేహానికి నివాళులర్పించిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బూడిద బిక్షమయ్యగౌడ్.వీరివెంటా మండల, గ్రామ బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించీన మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

**ఆత్మకూరు(ఎం),జూలై03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం సింగారం గ్రామం మధిర కాల్వపల్లి గ్రామానికి చెందిన రేంది సంపత్ వివాహం శుక్రవారం రోజు జరుగగా ఈ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి.వీరివెంటా సప్పిడీ పురుషోత్తం రెడ్డి, కోరే బిక్షపతి, పల్లెర్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# కొరటికల్ గ్రామం నుండి ఉప్పల్ వరకు నూతన ఆర్టీసీ బస్సు సర్వీస్ ప్రారంభం

### ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

### స్వయంగా ఆర్టిసి బస్సును నడుపుతూ బస్ సర్వీస్ ప్రారంభోత్సవం



**ఆత్మకూరు(ఎం),జూలై03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం కొరటికల్ గ్రామంలో నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శుక్రవారం ప్రారంభించారు. గ్రామ ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళల చిరకాల కోరిక మేరకు కొరటికల్ గ్రామం నుండి ఉప్పల్ వరకు ఈ నూతన బస్సు సర్వీసును అందుబాటులోకి తీసుకురావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వయంగా బీర్ల ఐలయ్య బస్సు నడుపుతూ బస్సు సర్వీస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కొరటికల్ నుండి ఉప్పల్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ బస్సు సర్వీసు ద్వారా ప్రతిరోజూ ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు, వృద్ధులు ఎంతో ప్రయోజనం పొందుతారని తెలిపారు.ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల అవసరాలకే ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్న ఆయన, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ఆలేరు నియోజకవర్గంలోని ప్రజలకు మెరుగైన ఆర్టీసీ సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజలకు అవసరమైన గ్రామీణ రహదారులపై కొత్త బస్సు సర్వీసులను ప్రారంభించడం, ఇప్పటికే ఉన్న సర్వీసులను బలోపేతం చేయడం ద్వారా విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు.గతంలో నష్టాల్లో ఉన్న తెలంగాణ ఆర్టీసీని ప్రజా పాలన ప్రభుత్వం సమర్థవంతమైన నిర్ణయాలతో క్రమంగా లాభాల బాట పట్టించిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అమలు చేయడం ద్వారా లక్షలాది మంది మహిళలకు ఆర్థిక భారం తగ్గిందని, ఇది ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి నిదర్శనమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని డిపోల బస్సులు ఆపాలని రహీంఖాన్ పేట బస్టాప్ వద్ద ధర్నా

### ఎక్స్ప్రెస్, డిలక్స్, రాజధాని తదితర అన్ని రకాల బస్సులు ఆపాలి

### సిపిఐ మండల శాఖ ఆధ్వర్యంలో..

### ఆయా డిపో మేనేజర్లతో చరవాణిలో సమస్యను వివరించి సానుకూలంగా వ్యవహారింపచేసిన ఎస్సై లక్ష్మీనారాయణ



**ఆత్మకూరు(ఎం),జూలై03/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం రహీంఖాన్ పేట గ్రామం శుక్రవారం రోజు భారత కమ్యూనిస్టు పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో రహీంఖాన్ పేట స్టేజి వద్ద అన్ని డిపోల బస్సులు ఆపాలని, ఎక్స్ప్రెస్ మరియు డీలక్స్,రాజధాని, గరుడ, బస్సులను ఆపాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ సుమారు పది గ్రామాలకు కూడలిగా ఉన్న రహీంఖాన్ పేట గ్రామం బస్టాప్ వద్ద బస్సులు ఆగక పోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారనీ , రహీంఖాన్ పేట స్టేజినీ ఎస్సార్ లో నమోదు చేసి అన్ని బస్సులు ఆపాలని డిమాండ్ చేశారు. గతంలో పలుమార్లు డిపో మేనేజర్ మరియు మంత్రులు ఎమ్మెల్యేలకు విన్నవించుకున్న కూడా స్పందన లేదన్నారు. కరోనా ముందు నడిపిన బస్సులన్నీ పునరుద్ధరణ చేసి యధావిధిగా నడపాలని అన్నారు. ఈ ఆందోళనలో ఎస్ఐ లక్ష్మీనారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని తొర్రూరు, యాదగిరిగుట్ట,సూర్యాపేట డిపో మేనేజర్లతో ఫోన్లో మాట్లాడి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, రాష్ట్ర చేనేత సంఘం ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనరసయ్య,సిపిఐ మండల్ కార్యదర్శి మారుపాక వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎండీ నయీమ్,ఏఐటీయూసీ జిల్లా నాయకులు కూరేళ్ల మచ్చగిరి ఈ కార్యక్రమానికి మద్దతుగా రహీంఖాన్ పేట సర్పంచ్ సుధాగాని కళావతి లింగయ్య ,కూరెళ్ల సర్పంచ్ గడ్డం ముత్తమ్మ,తుక్కాపురం సర్పంచ్ సంగపాక శ్రీవాణి మహేష్, పుల్లాయగూడెం సర్పంచ్ నర్రాముల రామలింగయ్య యాదవ్,రాఘవాపురం సర్పంచ్ ఎరుకల యతీశ్వర్ గౌడ్,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కలువల నరసయ్య,మారుపాక అంజయ్య, జక్క దయాకర్ రెడ్డి కూరెళ్ల ఉప సర్పంచ్ అనుమతుల రమేష్, పుల్లాయగూడెం ఉపసర్పంచ్ తండా రమేష్,తాళ్లపల్లి నర్సయ్య,సోమన బోయిన నరసింహ, మారుపాక యాదయ్య, బత్తిని లింగయ్య, మజ్జిగ నరసయ్య, వీరితోపాటు రహీంఖాన్ పేట, కూరెళ్ల, పుల్లాయగూడెం రాఘవపురం, తుక్కాపురం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# జిల్లా అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి



**యాదాద్రి జిల్లా, జూలై 3, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ వెంకారెడ్డి లు శుక్రవారం ఎఫ్సీఐ డిఎం అఫీషియల్స్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలతో, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైస్ మిల్లులలో సీఎంఆర్ బియ్యం డెలివరీ విషయంలో మిల్ టనేజ్ ప్రకారం బియ్యం డెలివరీ చేయాలని సూచించారు. రైల్వే వాగన్ ఎక్కువగా పెంచమని ఎఫ్ సి ఐ డి ఎం నీ కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మాట్లాడుతూ.. రైల్వే వాగన్ పెంచితే బియ్యం తొందరగా డెలివరీ ఔతాయని,బియ్యం లాట్లు బుక్ ఔతాయని ఎఫ్సీఐ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాలు, ఎఫ్సీఐ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# నూతన పాలకమండలికి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సహకార శాఖ సీనియర్ ఇన్స్పెక్టర్ విజయ్ సింహ.

**శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ, దివంగత సిలివేరి ప్రహ్లాద్ మార్గదర్శకాలతో... చేనేత కార్మికులకు అండగా నిలుస్తాం : వరకాల ప్రమీల**

**భద్రావతి చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రమీల.**

**ప్రధాన కార్యదర్శిగా పాశికంటి రమేష్**

**కోశాధికారిగా పగిడిమర్రి సూర్యనారాయణ ఏకగ్రీవం.**



**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** చేనేత సహకార సంఘాల అభ్యున్నతికి కృషిచేసిన దివంగత శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళతామని శ్రీ భద్రావతి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గం స్పష్టం చేసింది. దశాబ్దాలపూర్వమే చేనేతలకు ఉపాధి, వారి కుటుంబాల ఆర్థిక అభివృద్ధిని కాంక్షిస్తూ సొసైటీ వ్యవస్థాక సభ్యులుగా కొనసాగిన ప్రముఖ తెలంగాణ ఉద్యమ నాయకుడు దివంగత కొండా లక్ష్మణ్ బాపూజీ, దివంగత సిలివేరి ప్రహ్లాద్ మార్గదర్శకాలతో శ్రీ భద్రావతి హ్యాండ్లూమ్ కో-ఆపరేటివ్ సొసైటీ కి వన్నె తీసుకు వస్తామని వారు తెలిపారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకార శాఖ సీనియర్ ఇన్స్పెక్టర్, ఎన్నికల అధికారి విజయసింహ ఆధ్వర్యంలో నూతన పాలక మండలి ఎన్నికలు జరిగాయి. సుల్తాన్ షాహి, గౌలిపుర, లాల్ దర్వాజా, ఉప్పుగూడ కాటేదాన్ మార్కండేయ నగర్, రక్షాపురం, దూద్ బౌలి ప్రాంతానికి చెందిన చేనేత కార్మికులు నూతన కార్యవర్గం ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలలో శ్రీ భద్రావతి హ్యాండ్లూమ్ కో- ఆపరేటివ్ రివర్స్ (ఉత్పత్తి మరియు విక్రయం) సొసైటీ నూతన చైర్ పర్సన్ గా వరకాల ప్రమీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నాడెపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా పాశికంటి రమేష్, కోశాధికారిగా పగిడిమర్రి సూర్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.. అలాగే సొసైటీ డైరెక్టర్లుగా వి. యాదగిరి, సామల పెంటయ్య, వరకాల భాస్కర్, కె.శ్రావణ్, వి . యామినిసౌభాగ్యము నియమితులయ్యారు. ఈ సందర్భంగా సొసైటీ నూతన అధ్యక్షురాలు వరకాల ప్రమీల మాట్లాడుతూ పాతబస్తీ సుల్తాన్ షాహిలోని అతి పురాతనమైన తమ సొసైటీకి ఆదరణ లేక గత కొంతకాలంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. గుర్తింపు పొందిన సొసైటీల ద్వారా చేనేతలకు ఆర్థికపరంగా కూడా సహకారం ప్రభుత్వం ద్వారా అందించాలని కోరారు. చేనేత రంగ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో భద్రావతి చేనేత సహకార సంఘం ఆదర్శంగా తీర్చిదిద్దడానికి నూతన పాలకవర్గంతో తన వంతు కృషి చేస్తారని వెల్లడించారు. సొసైటీ ద్వారా చేనేత కార్మికుల కావలసిన సహకారం అందిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నూతన పాలక మండలి ప్రతినిధులను చేనేత కార్మికులు ఘనంగా సన్మానించారు. నూతన కార్యవర్గం క్రియాశీలకంగా పనిచేసి నిరుపేద నేత కార్మికుల ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాలని వారు కోరారు...

# ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



**ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి...**

**ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్**

**చౌటుప్పల్,జులై 3,క్రైమ్ మిర్రర్ :** పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కార్యదర్శి తీగుళ్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం భారత విద్యార్థి ఫెడరేషన్ చౌటుప్పల్ మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో స్వాగత సభను నిర్వహించారు . ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న వేలాది మంది విద్యార్థులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం లేకపోవడంతో ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఆకలితోనే తరగతులకు హాజరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు కూడా విస్తరించి, విద్యార్థులందరికీ పోషకాహారం అందించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే, విద్యార్థులకు రావలసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నెలల తరబడి పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలన్నింటినీ విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, విద్యార్థులు స్వచ్ఛమైన తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కళాశాలలో తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సరిపడా ఫ్యాన్లు, విద్యుత్, ఫర్నిచర్, తరగతి గదుల మరమ్మతులు వంటి అన్ని మౌలిక సదుపాయాలను ప్రభుత్వం అత్యవసరంగా కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులను సమీకరించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు అరవింద్, మండల ఉపాధ్యక్షులు ఇరిగి వరుణ్ తేజ్,మండల నాయకులు పోలేపల్లి మల్లేష్,లక్ష్మీ ప్రసన్న ,మాధురి ,శివకుమార్ ,సిద్దు ,జస్వంత్ ,ఎస్ కుమార్ ప్రణీత్ ,మనోజ్ ,వరుణ్ తేజ్, తరుణ్ విద్యార్థులు, కళాశాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ వలసదారులపై పోరు ఆగేది లేదు

**బాలాపూర్(క్రైమ్ మిర్రర్) :** అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలకు ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తున్న మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్, ప్రజా నాయకుడు అందెల శ్రీరాములు యాదవ్ పై జరిగిన దాడి, పోలీసుల అక్రమ అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించిన మీర్పేట్ బీజేపీ శ్రేణులు. ఎం.బి.టి అధ్యక్షుడు అంజద్ ఉల్లా ఖాన్ విసిరిన సవాల్‌ను స్వీకరించి, చర్చకు ధైర్యంగా బయలుదేరిన అందెల శ్రీరాములు యాదవ్ ని ఓవైసీ హాస్పిటల్ వద్ద అక్రమముగా అరెస్టు చేసినందుకు సంతోష్ నగర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తూ అక్రమ వలసదారులపై పోరు ఆగేది లేదంటూ నినాదాలు చేసిన బిజెపి నాయకులను కాంచన్ భాగ్ పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ క్లస్టర్ 1.2. అధ్యక్షులు పసునూరి బిక్షపతి చారి, తులసి ముకేశ్ ముదిరాజ్, జిల్లా నాయకులు నీలా రవి నాయక్, రాష్ట్ర నాయకులు లక్ష్మీ, ఇంద్రావతి రవి నాయక్, ఎడ్ల మల్లేష్ ముదిరాజ్, సోమేశ్వర, గాజుల మధు, మన్నెం రవీందర్ రెడ్డి, రాఘవేందర్ గౌడ్, కసి రామ్ యాదవ్, కీసర హరినాథ్ రెడ్డి, సతీష్, విక్కీ సాగర్, బిజెపి నాయకులు కార్యకర్తలు ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మెరిట్ విద్యార్థుల ఉన్నత విద్యకు చేయూత..

**ముఖ్య అతిథిగా పాల్గొన్న మిరియాల ప్రీతమ్....**

**చందానగర్ క్రైమ్ మిర్రర్ :** ఉన్నత విద్యకు ప్రోత్సాహం అందించే ప్రతి కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల ప్రీతమ్ తెలిపారు.శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో చందానగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, 18 మంది మెరిట్ విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం మొత్తం రూ.1,18,000 విలువైన ఆర్థిక సహాయ చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మిరియాల ప్రీతమ్ మాట్లాడుతూ..విద్యే సమాజ ప్రగతికి బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడదని, అలాంటి విద్యార్థులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వారికి చేయూత అందిస్తున్న శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సాంబశివరావు, విష్ణుమూర్తి, సత్తిబాబు, ప్రసాద్, విద్యార్థులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.





## ఎఫ్సీఐ అధికారులు,రైస్ మిల్లర్లతో కలెక్టర్ సమావేశం

**-జిల్లా అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి**

**యాదాద్రి జిల్లా, జూలై 3, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్,అదనపు కలెక్టర్ వెంకారెడ్డి లు శుక్రవారం ఎఫ్సీఐ డిఎం అఫీషియల్స్ ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలతో, రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైస్ మిల్లులలో సీఎంఆర్ బియ్యం డెలివరీ విషయంలో మిల్ టనేజ్ ప్రకారం బియ్యం డెలివరీ చేయాలని సూచించారు. రైల్వే వాగన్ ఎక్కువగా పెంచమని ఎఫ్ సి ఐ డి ఎం నీ కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి మాట్లాడుతూ.. రైల్వే వాగన్ పెంచితే బియ్యం తొందరగా డెలివరీ ఔతాయని,బియ్యం లాట్లు బుక్ ఔతాయని ఎఫ్సీఐ అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాలు, ఎఫ్సీఐ అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.వరల్డ్ మెకానిక్ డే వేడుకలు

## జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్

**పెబ్బేరు జులై 3 క్రైమ్ మిర్రర్:** పెబ్బేరు పట్టణంలో శ్రీ సాయిబాబా మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో వరల్డ్ మెకానిక్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి పెబ్బేరు మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్? కట్? చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మెకానిక్‌ల పాత్ర ఎంతో కీలకమైందని, వాహనాల నిర్వహణ, రవాణా వ్యవస్థ సజావుగా కొనసాగడంలో వారి సేవలు ప్రశంసనీయమని అన్నారు. మెకానిక్‌లు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం యూనియన్ సభ్యులు వరల్డ్ మెకానిక్ డే సందర్భంగా పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొని, మెకానిక్‌ల సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని ప్రతిజ్ఞ చేశారు. చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ కు శాలువాలతో ఘనంగా సన్మానించారు.మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వెంకటేష్ సాగర్, రణధీర్ రెడ్డి, యూనియన్ నాయకులు, మెకానిక్‌లు భాస్కర్, బండమీది నరసింహ, ఎండి. ఉస్మాన్, ఎండి. బురాన్, విశ్వనాథ్ రెడ్డి, ఎండి. మోయిన్, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల్లోనే వజ్రాల్లాంటి విద్యార్థులు





**సంస్థాన్ నారాయణపురం,జూలై 03 (క్రైమ్ మిర్రర్):** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోనే వజ్రా లాంటి విద్యార్థులు ఉంటారని సంస్థాన్ నారాయణపురం సర్పంచి ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి తెలిపారు. రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంస్థాన్ నారాయణపురంలోని బాలుర బాలికల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ సమకూర్చిన రూ. 3 లక్షల విలువైన 'స్టూడెంట్స్ కిట్స్', స్పోర్ట్స్ కిట్స్ లను తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి పోలీస్ ఎస్ఐ జగన్ ఎంఈఓ శ్రీనివాస్ లతో కలిసి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి మాట్లాడుతూ, మట్టిలో మాణిక్యాల మరుగున పడిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు రిలయబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చినందుకు అభినందించారు. ఎంతో ప్రతిభ, బోధనా అనుభవం ఉన్న ఉపాధ్యాయులు తమ పాఠశాలలోని విద్యార్థులను సాన పెట్టి విలువైన వజ్రాల తీర్చిదిద్దాలని కోరారు. తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికి అపారమైన మేధస్సు ఉంటుందని, దాన్ని ఉపయోగించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు. పోలీస్ ఎస్ఐ జగన్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యమని అన్నారు. సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేయకూడదని, మంచి కోసం వినియోగించాలని సూచించారు.

**రిలయబుల్ ట్రస్ట్ సహకారం అభినందనీయం: ఎంఈఓ**

రిలయబుల్ ట్రస్ట్ అందించిన సహకారం విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని సంస్థాన్ నారాయణపురం ఎంఈఓ జి శ్రీనివాస్ తెలిపారు. సంస్థాన్ నారాయణపురం మండలం సర్వేలు గుజ్జ గ్రామాల్లోని జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు రిలయబుల్ ట్రస్ట్ సమకూర్చిన స్టూడెంట్స్ కిట్స్ ను ఆయన చేతుల మీదుగా శు క్రవారం పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఉన్న ప్రోత్సహించడానికి రిలయబుల్ ట్రస్టు ద్వారా గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ అందించినందుకు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీలు తుపాకుల రవి, సత్యానందములకు కృతజ్ఞతలు తెలిపారు. గుజ్జ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్, ట్రస్టు ప్రతినిధి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కలిసిన మండల పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి



**నూతనకల్ (క్రైమ్ మిర్రర్):** మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కట్ట మల్లారెడ్డి శుక్రవారం తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు చేతుల మీదుగా అధ్యక్ష నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా నూతనకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట మల్లారెడ్డి మాట్లాడుతూ నా యొక్క అధ్యక్ష నియామకానికి సహకరించిన జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్,పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడిపాటి నర్సయ్య , రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. మండలంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణానికి నా శాయశక్తుల పోరాడుతానని, కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా, రాబోయే మండల పరిషత్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జెన్నారెడ్డి వివేక్ రెడ్డి గారు,మాజీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలు చంద్రకళ,మండల కాంగ్రెస్ నాయకులు భూరెడ్డి సంజీవరెడ్డి, చురకంటి చంద్రారెడ్డి, నకిరేకంటి వెంకన్న సేవాదళ్ నియోజకవర్గం అధ్యక్షుడు పాల్వాయి నాగరాజు, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్, ఇరుగు కిరణ్ కుమార్,మద్దెల సురేందర్, జటంగి గణేష్ యాదవ్, జహంగీర్, ఇమ్మారెడ్డి మహేశ రెడ్డి,బొల్లేపల్లి సాయి, వరుణ్, దేవరకొండ సాయి, నవిల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయి నుంచి ఒలింపిక్స్ స్థాయికి ఎదగాలి

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి:** క్రీడాకారులు గ్రామీణ స్థాయి నుంచి ఒలంపిక్స్ స్థాయికి ఎదగాలని కల్వకుర్తి మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ అభిప్రాయపడ్డారు. ఈనెల 18వ తేదీన మెదక్ జిల్లాలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న 4వ తెలంగాణ రాష్ట్ర మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ అథ్లెటిక్స్ మీట్--2026 కోసం నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల అథ్లెటిక్స్ మైదానంలో శుక్రవారం విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ ఎంపికల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు 150 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి మున్సిపల్ కమీషనర్ మహమూద్ షేక్ హాజరై జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వచ్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఒలింపిక్స్‌లో పాల్గొనే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే స్పోర్ట్స్ కోటా ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలను త్వరగా సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల విద్యార్థులు, యువత క్రీడలను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకుని క్రమశిక్షణతో సాధన చేయాలని సూచించారు. అనంతరం ఎంపికల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను మున్సిపల్ కమిషనర్ ప్రశంసాపత్రాలతో సత్కరించి అభినందించారు. లింగసానిపల్లి వార్డు సభ్యుడు కావలి శేఖర్, కల్వకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జిహెచ్ఎం బాలు నాయక్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బిక్షపతి, సంయుక్త కార్యదర్శి అంజయ్య, పీడీలు షంషీర్ క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




-కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్...

-యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి జిల్లా, జులై 3,క్రైమ్ మిర్రర్ :** మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. శుక్రవారం కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమం రెండవ రోజున జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా డిఆర్డిఏ --సెర్ప్ ల ఆధ్వర్యంలో, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖల సహకారంతో, హెట్రో గ్రూప్ సంస్థల సి.ఎస్. ఆర్ నిధుల సహకారముతో స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు నిర్వహిస్తున్న 10 రోజుల కిసాన్ డ్రోన్ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమం రెండవ రోజు విజయవంతంగా కొనసాగింది. శిక్షణ కార్యక్రమం రెండవ రోజు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి పాల్గొని శిక్షణను పరిశీలించారు. ఈ సందర్భంగా మహిళా సంఘ సభ్యులతో ఆయన మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత వినియోగం వల్ల వ్యవసాయ వ్యయాలు తగ్గడంతో పాటు పనుల సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని 17 మండలాల నుండి ఎంపికైన 51 మంది స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారని తెలిపారు. మీరై మరియు ఫ్లైయింగ్ వెడ్జి , బెంగళూరు సంస్థలకు చెందిన నిపుణుల బృందం డ్రోన్ ఆపరేషన్, భద్రతా ప్రమాణాలు, నిర్వహణ, వ్యవసాయంలో డ్రోన్ వినియోగం తదితర అంశాలపై సైద్ధాంతిక, ప్రాయోగిక శిక్షణ అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళలను సాంకేతికంగా తీర్చిదిద్ది, వ్యవసాయ రంగంలో నూతన ఉపాధి అవకాశాలను కల్పించడం ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి టి. నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెట్రో గ్రూప్ సంస్థల సిఎస్ఆర్ హెడ్ యన్ సుధాకర్ , జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి , జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రవీందర్ పాల్గొని శిక్షణ పొందుతున్న సభ్యులను అభినందించారు. అలాగే అదనపు డిఆర్డిఓ , జిల్లా ప్రాజెక్టు మేనేజర్,జిల్లా సమాఖ్య ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠా గుట్టురట్టు...

నెల పసికందు సురక్షితంగా రక్షణ....

పసికందు కోసం రూ. 1.5 లక్షల డీల్......



**సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ :** నెలరోజుల పసికందు కిడ్నాప్ కేసును సైబరాబాద్ చందానగర్ పోలీసులు 72గంటల్లో ఛేదించారు. ఈ సందర్భంగా శుక్రవారం సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి రమేష్ రెడ్డి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.గత నెల 30వ తేదీ అర్ధరాత్రి అనంతరం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న మహిళ వద్ద నుంచి నెల రోజుల వయస్సు గల ఆడశిశువును కిడ్నాప్ చేసిన ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి.. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా తప్పిపోయిన, కిడ్నాప్‌కు గురైన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు అప్పగించే క్రమంలో ఈ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని కేవలం 72 గంటల్లోనే కేసును ఛేదించి పాపను సురక్షితంగా రక్షించారు.పశ్చిమ బెంగాల్‌కు చెందిన సాధిక మక్సూద్ అనే మహిళకు సంతానం లేకపోవడంతో పాపను అక్రమంగా తెప్పించుకునేందుకు కుట్ర పన్నినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. 'ఆమె బ్యూటీ పార్లర్‌లో పనిచేస్తున్న నిమ్మి జహాన్, రహనుమా అలీల సహాయం కోరింది. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న కర్ణాటక కు చెందిన కుటుంబం వద్ద నుంచి పసికందును ఆటోలో ఎత్తుకెళ్లారు. ఈ శిశువును తీసుకురావడానికి కిడ్నాపర్లకు సాధిక మక్సూద్ రూ.1.50 లక్షలు చెల్లించినట్లు విచారణలో తేలింది. అనంతరం పాపతో కలిసి కోల్‌కతాకు వెళ్లేందుకు రైల్వే టికెట్లు కూడా బుక్ చేసుకున్నప్పటికీ, వేగంగా స్పందించి వారిని అదుపులోకి తీసుకుని పాపను రక్షించాం' అని తెలిపారు.ఈ కేసులో ఏ1 మొహమ్మద్ జుబెర్, ఏ2 మొహమ్మద్ ఇర్ఫాన్, ఏ3 సాధిక మక్సూద్, ఏ4 నిమ్మి జహాన్, ఏ5 రహనుమా అలీలను అరెస్ట్ చేసామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ క్రైమ్స్ శ్రీనివాస్, ఆర్ సి పురం ఏసీబీ వై శ్రీనివాస్ రావు, చందానగర్ సిఐ విజయ్ కుమార్, అమీన్పూర్ డిఐ భాస్కర్ తో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



# విద్య,వైద్యం,ఉపాధి అందరికి అందాలన్నదే నా ధ్యేయం

-ఇ.ఎల్. వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్

**చౌటుప్పల్, జూలై 3, క్రైమ్ మిర్రర్ :** కనీస అవసరాలైన విద్య,వైద్యం, ఉపాధి అందరికి అందాలన్నదే తన ధ్యేయమని ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిబావి గ్రామంలో సందర్శించారు. గ్రామ ప్రజలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ నందగిరి వెంకటేష్ ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ ను ఘనంగా సన్మానించారు. స్థానిక ప్రజల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా తమ ఫౌండేషన్ పనిచేస్తోందని పేర్కొన్నారు. రెడ్డిబావి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, భద్రత నిమిత్తం సొంత ఖర్చులతో త్వరలోనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రోత్సహిస్తామన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే కంగారుపడి కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసి అప్పులపాలు కావొద్దన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఫౌండేషన్ ను సంప్రదిస్తే, ఆసుపత్రుల్లో తమ వంతు మెరుగైన వైద్య సేవలు అందేలా చూస్తామని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల సమస్యలు ఉన్నా స్థానిక యువత, పెద్దలు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.వాటిని పరిష్కరించేందుకు ఫౌండేషన్ తరఫున కృషి చేస్తామని తెలిపారు.

# ముఖ్యమంత్రి పై అనుచిత పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఫిర్యాదు

**పెబ్బేరు జూలై 3 క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత పోస్టులు పెట్టిన అనుమానస్పద వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ... పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు యాపర్ల రామిరెడ్డి మాట్లాడుతూ...రాజకీయ కక్షతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం, పరువుకు భంగం కలిగించే పోస్టులు పెడుతున్నరని ఆరోపించారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అత్యంత అసభ్యకరమైన బూతులతో కూడిన భాషను ఉపయోగించి కామెంట్ చేయడం ఇటువంటి వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు శాంతిభద్రతరకు విఘాతం కలిగించే అవకాశం ఉందని ఇట్టి విషయంపై విచారణ జరిపి అట్టి వ్యక్తులపై కట్టిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్,వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్,రామన్ గౌడ్,నరేందర్, నరసింహనాయుడు,రణధీర్ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు